
# కరిగిన స్వప్నం

- పి. కృష్ణమూర్తి



మధు స్కూటర్ దిగి ఇంట్లో అడుగు పెడుతూనే చెల్లెలు మాధవి నవ్వుతూ ఎదురొచ్చింది. "అన్నయ్యా...అన్నయ్యా! మనింటి కెవ రొచ్చారో చెప్పుకో చూదాం" అంది.

"ఎవ రొచ్చారమ్మా?" మధు పెదవులపై చిరునవ్వు తొణికిస లాడింది.

"వదిన, వాళ్ళ నాన్నగారూను."

"వదినా!" మధు ముఖంలో ఆశ్చర్యం.

"ఆఁ! స్వప్న వదిన, వాళ్ళ నాన్నగారూ!" అన్చెప్పి ఇంట్లోకి తుర్రుమంది మాధవి.

'ఇప్పుడు వీళ్ళెందు కొచ్చినట్లు' అనుకొంటూ హాల్లోకి నడిచాడు మధు. సోఫాలో రామనాథం మామయ్య కూర్చుని ఉన్నాడు. కొన్త దూరంలో తన తల్లి అన్నపూర్ణమ్మ కూర్చుని ఉంది. స్వప్న అన్నపూర్ణమ్మకు వెనగ్గా నిలుచుని ఉంది.

"మధూ! బావున్నావా, బాబూ!" పలకరించాడు రామనాథం.

"ఆఁ... బావున్నా, మామయ్యా! అది సరే, మీ రేమిటి ఉత్తరం ముక్కైనా రాయకుండా వచ్చేశారు. ముందుగా తెలి స్తే స్టేషనుకు వచ్చేవాడిని కదా?" అన్నాడు మధు, ఉత్సాహంగా.

"ఫరవాలేదు, బాబూ! అంత వ్యవధి లేకపోయింది. ఉన్నపళంగా రావల "స వచ్చింది." తల వంచుకొని చెప్పాడు రామనాథం.

మధు స్వప్నవైపు చూస్తూ, "ఏం, స్వప్నా, ఎలా ఉన్నావ్? కాలేజీలో చేరాక మరీ మాటలు కూడా కరువై పోయాయ్?" కళ్ళెగరేస్తూ అడిగాడు. స్వప్న తల దించుకొనే ఉంది.

మధు ఎంత ఉత్సాహంగా మాట్లాడుతున్నా, తండ్రీ కూతు ళ్ళిద్దరూ పొడి పొడిగా సమాధానాలిస్తున్నారు. మధుకు పరి "స్థితి అర్థం కాలేదు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ గలగలా గోదారిలా మాట్లాడే స్వప్న ఇలా మూగవోయి, దైన్యంగా ఉగ్గడటం ఇదే మొదటిసారి.



"స్వప్నా! బాగా అలసిపోయి నట్లున్నావు. కాస్సేపు విశ్రాంతి తీసుకొందువు గాని, మేడ మీది కెళ్దాం రా!" అభ్యర్థన పూర్వకంగా అడిగాడు మధు.

స్వప్న రామనాథం వైపు చూసింది. వెళ్ళమన్నట్లు కళ్ళతోనే సమాధానం చెప్పాడు రామనాథం.

స్వప్న మధు వెంట మేడపైకి వెళ్ళింది. మధు గదులన్నీ చూపించి తన గదిలోకి తీసుకెళ్ళి, "స్వప్నా! కాస్సేపు విశ్రాంతి తీసుకో. నేను వెళ్ళి మామయ్యతో మాట్లాడుతాను. నీకు తోడుగా మాధవిని పంపుతాను" అన్నాడు.

స్వప్న తలూపింది.

మధు మామయ్య దగ్గర కొచ్చి కూర్చుని, మాధవిని మేడపైకి పంపించాడు.

** ** **

స్వప్న గదిని పరిశీలనగా చూస్తోంది. అల్మైరాలో లెక్కకు మించి పుస్తకాలు అందంగా పేర్చబడి ఉన్నాయి. గోడలకు ఆధునిక చిత్రాలు వ్రేలాడదీయబడి ఉన్నాయి. కిటికీకి ఇవతల టేబిల్ మీద కొన్ని పుస్తకాలు, మధు ఫోటో, ప్రక్కగా ఫ్లవర్ వేజ్ ఉన్నాయి. స్వప్న కిటికీ తెరిచింది. చల్లటి గాలి ముఖాన్ని తాకి ముంగురులు అందంగా నాట్యమాడ సాగాయి. స్వప్న కిటికీ లోంచి బయటికి చూసింది. అందమైన ప్రకృతి... దూరంగా అలిపిరి గాలిగోపురం, కపిలతీర్థం జలపాతం దృశ్యం. ఘాట్ రోడ్డులో ఒకదాని వెంట ఒకటిగా వస్తున్న తిరుమల బస్సులు కనిపించాయి. మళ్ళీ స్వప్న చూపులు మధు ఫోటోపై నిలిచాయి. 'బావతో మాట్లాడుతూ ఉంటే జీవితం మీద ఆశ, ధైర్యం కలుగుతున్నాయి. తనెంత దురదృష్టవంతురాలు. తన విషయం బావకు తెలిస్తే ఏమనుకొంటాడో! ఎంత అసహ్యించుకొంటాడో!' స్వప్న మనసు పరిపరి విధాలుగా పోతోంది. అప్రయత్నంగా టేబిల్ మీదున్న ఓ పుస్తకం తీసుకొని పేజీలు తిరగవేస్తున్న స్వప్నకు అందులో తన ఫోటో. ఆ ఫోటో క్రింద 'స్వప్న' అని రాసుకున్న బావ అక్షరాలూ కనిపించాయి. స్వప్న క్షణకాలం రెప్పపాటు లేకుండా నిలుచుండి పోయింది. 'బావ నన్ను ఇంతగా అభిమానిస్తున్నాడా! అయినా, తను బావకు అంకితం కాగలదా?' ఆలోచనలో మునిగిపోయిన స్వప్న మాధవి పిలుపు విని ఉలిక్కి పడింది.

"ఏమి టొదినా! మరీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అంది కళ్ళింత చేసుకొని, టీ కప్పు టేబిల్ మీద పెడుతూ మాధవి.

"అబ్బే... ఏం లేదు, మాధవీ!" సర్దుకోవడానికి ప్రయత్నించింది స్వప్న. మళ్ళీ తనే అంది- "మాధవీ! క్రింద ఎవరెవ రున్నారు?"

"మామయ్య, మా అన్నయ్య ఉన్నారు. ఏదో రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. నన్ను కూడా వెళ్ళిపొమ్మన్నారు" అంది మాధవి బుంగమూతి పెట్టి.

స్వప్నకు వాళ్ళు మాట్లాడుకునే దేమిటో అర్థమైపోయింది. మాధవికి కనిపించకుండా కన్నీళ్ళు తుడుచుకొని తలను మరొకవైపుకు త్రిప్పి కూర్చుంది.

** ** **

రామనాథం మామయ్య చెప్పలేక చెప్పిన విషయం విని మధు మ్రాన్పడిపోయాడు. స్వప్నకు ఇంత ఘోరం జరిగిందా? ఇందులో స్వప్న పొరపాటేమైనా ఉందా?

ఇదంతా నిజంగా జరిగిందా? జరిగే ఉంటుంది. కన్న తండ్రి అబద్ధం చెప్పవలసిన పనేముంది! రామనాథం గారిని మాటలతో ఓదార్చి, "మామయ్యా! జరిగిపోయిం దేదో జరిగిపోయింది. ఇట్లాంటప్పుడే ధైర్యంగా ఉండాలి. స్వప్నతో మాట్లాడి ఏమైనా చేద్దాం" అన్నాడు. మధు మాటలలో మునుపటి ఉత్సాహం లేదు. అతని మాటలు యాంత్రికంగా ఉన్నాయి. మన సెక్కడెక్కడో పరిభ్రమిస్తోంది. ఏదేదో అయిపోతూ ఉంది. అయినా, గుండెను దిటవు చేసుకొన్నాడు. తానేం చేయాలో నిర్ణయించుకొని తన నిర్ణయాన్ని రామనాథానికి చెప్పి మేడపైకి వెళ్ళాడు.

** **

శ్రీనివాస మంగాపురంలో బస్సు దిగారు మధు, స్వప్న.

"స్వప్నా! ఇక్కడ శ్రీ వేంకటేశ్వరస్వామి పద్మావతితో కలిసి ఆరుమాసాలు కాపురం ఉన్నాడట. నిజానికి ఈ ప్రదేశం ఎంతో అందంగా ఉంది కదూ?" అడిగాడు మధు.

అవు నన్నట్లు తలూపింది స్వప్న.

"ఆలయంలోకి వెళదామా?" అడిగాడు మధు.

మళ్ళీ తలూపింది స్వప్న.

"ఏం, మాటలు రావా నీకు?" సూటిగా చూసి, లేని ఉత్సాహం తెచ్చుకొంటూ అన్నాడు మధు.

స్వప్న పెదవులపై పేలవమైన దరహాసం విరిసింది. "వెళదాం, బావా!" అంది.

దర్శనం అయిపోయిన తరవాత ఇద్దరూ ముఖమంటపంలో ఓ మూల కూర్చున్నారు. ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది.

మధు అన్నాడు: "స్వప్నా! నువ్వు నన్ను అభిమానిస్తున్నావు కదూ?"

"ఏం, బావా, ఎందు కొచ్చిం దా అనుమానం?"

"చెప్పు, స్వప్నా! నీ బాధలు, నీ ఆవేదన నాకు చెప్పు. జరిగిం దేమిటో చెప్పు..." సూటిగా చూస్తూ అడిగాడు మధు.

స్వప్న మధువైపు సూటిగా చూడలేక పోతోంది. తల దించుకొని నేల చూపులు చూస్తూ అంది- "బావా! నా జీవితం పాడైపోయింది... దేవుడు లాంటి నీకు..." ఇక చెప్పలేక పోయింది. భోరున ఏడ్చేస్తోంది.

మధుకి ఏం చేయాలో తోచటం లేదు. స్వప్నను ఓదార్చి యథాస్థితికి తీసుకు రావడానికి అరగంటపైనే పట్టింది. "స్వప్నా! గతాన్ని తవ్వుకొని ప్రయోజనం లేదు. మామయ్య నాకు కొంత చెప్పాడు. నా మీద నీకే మాత్రం గౌరవం ఉన్నా, జరిగింది జరిగినట్లు చెప్పు." అనునయంగా అడిగాడు మధు.


"చెబుతాను, బావా, చెబుతాను." కన్నీళ్ళు తుడుచుకొంది స్వప్న. "అతని పేరు రాజేంద్ర. నా నోట్సులు బావుంటాయని అప్పుడప్పుడూ తీసుకెళ్ళేవాడు. పారిజాతం అని వాళ్ళ చెల్లెలు కూడా మా క్లాసే. ఓ రోజు పారిజాతం కోసం వాళ్ళింటికి వెళ్ళాను. ఇంట్లో ఎవరూ లేరు. రాజేంద్ర ఒక్కడే ఉన్నాడు. సాదరంగా ఆహ్వానించాడు. కబుర్లు చెప్పాడు. పారిజాతం కోసం నేను కాస్సేపక్కడే ఉన్నాను. రాజేంద్ర తానే టీ కలిపి ఇచ్చాడు. అది తాగిన కొద్ది సేపటికే మగత వచ్చి నిద్ర పట్టేసింది. తరవాత...తరవాత..." స్వప్న గొంతు పూడిపోయింది. ఏడవలేక పోతోంది. కళ్ళు ఎర్రబారాయి. భుజా లెగిరి, పడుతున్నాయి.

"స్వప్నా! అర్థమయింది. అత నిప్పు డెక్కడున్నాడు?" గంభీరంగా అడిగాడు మధు.

స్వప్న చెప్పింది. మళ్ళీ తనే అంది: "బావా! ఓ నెలరోజులు మథన పడ్డాను. నీదాన్ని కావలసిన నేను పరాయివాడి చేతిలో నలిగిపోయాను. అప్పుడొక నిర్ణయాని కొచ్చాను. పారిజాతాన్ని కలిసి విషయం చెప్పాను. అదీ బాధ పడింది. రాజేంద్రను ప్రాధేయపడ్డాను. తన కో ఉద్యోగం వచ్చిన తరవాత వివాహం చేసుకుంటా నన్నాడు. నమ్మాను. ఇటీవలే తెలిసింది- అతడికి ఉద్యోగం వచ్చిందని, పెళ్ళి కూడా నిశ్చయ మయిందని! నాన్న వెళ్ళాడు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు. రాజేంద్ర అందరు మగాళ్ళ లాగే మాట్లాడాడట. బావా! ఇక ఆ విషయం మరిచిపో. నా జీవితాన్ని ఎవరూ బాగు చేయలేరు." విషాదంగా అంది స్వప్న.

"స్వప్నా! రాజేంద్ర దగ్గరికి నేను వెళ్ళొస్తాను. నేనూ ఒక ప్రయత్నం చేస్తాను. అతడు నిన్ను పెళ్ళి చేసుకొనేలా చూస్తాను. కాదనకు, స్వప్నా, ప్లీజ్!" అర్థించే ధోరణిలో అన్నాడు మధు.

"బావా! నువ్వు మొదటి నుంచీ ఇంతే. చెప్పిన మాట వినవు. కాలనాగులకు కాటేయడమే తెలుసు. రాజేంద్ర దగ్గరికి వెళ్ళడం అనవసరం. వెళ్ళి ప్రయోజనం ఉండదు.



పిచ్చి బావా... నీ ఇష్టం వెళ్ళిరా. కానీ. ఆ తేనె పూసిన కత్తి ఒప్పుకుంటాడన్న ఆశ నీ కింకా ఉందా!" నిరాశ. నిస్పృహ ధ్వనించిం దా కంఠంలో.

మధు జవాబివ్వలేదు. ఇక వెళదామన్నట్లు పైకి లేచాడు. ఇంతలో బస్సు వచ్చింది. తిరుప తిలో స్వప్నను వదిలేసి వెళ్ళిపోయాడు మధు.

** ** **

మధు బెజవాడలో దిగి గాంధీనగర్ వెళ్ళాడు. రాజేంద్ర ఇంటిని పట్టుకోడానికి పెద్దగా టైమ్ పట్టలేదు. ఇంటిని చూస్తే బాగా ఆస్తిపరుడే అనిపించింది.

"రాజేంద్ర ఉన్నారా అండీ?" హాల్లో పేపరు చదువుతున్న వ్యక్తిని అడిగాడు మధు.

"రాజేంద్ర నేనేనండీ! ఏం కావాలి మీకు?" పేపరు మడిచి టీపాయ్ మీద పెట్టి నుంచొని అన్నాడు రాజేంద్ర.

"నా పేరు మధు. మాది తిరుపతి. మీతో మాట్లాడాలి." వినయంగా చెప్పాడు మధు.

రాజేంద్ర... "సరే. మాట్లాడండి" అన్నాడు.

"కాదు అలా బయటికి వెళ్ళి మాట్లాడదాం. రండి" అన్నాడు మధు.

షర్టు వేసుకొని బయటకు నడిచాడు రాజేంద్ర. రాజేంద్రను అనుసరించాడు మధు. బందరు లాకుల దగ్గర ఆగా రిద్దరూ.

"మీకు స్వప్న తెలుసనుకుంటాను." ప్రా రంభించాడు మధు. అతని కంఠధ్వని కరుకుగా ఉంది.

"ఏ స్వప్న?" ఏమీ తెలియనట్లు అమాయకంగా ప్రశ్నార్థకం ముఖం పెట్టి అన్నాడు రాజేంద్ర.

"మీకు చాలామంది స్వప్నలు తెలిసుండవ చ్చు. నేను చెప్పేది మీ క్లాస్‌మేట్ స్వప్న గురించి. మీ చెల్లెలు పారిజాతం ఫ్రెండ్ స్వప్న గురించి." దూకుడుగా అన్నాడు మధు.

రాజేంద్రకు మధు ఎందుకొచ్చాడో అర్థమ యింది.

"చూడండి. మిస్టర్! ఇదివరకు రెండు రాయబా రాలు జరిగాయి. ఇది మూడో రాయబారం. స్వప్నకూ. నాకూ ఏ సంబంధమూ లేదు. స న్నిట్లా బ్లాక్‌మెయిల్ చేయడం కూడా ఏమీ బాగో లేదు." గంభీరంగా అన్నాడు రాజేంద్ర.

"మిస్టర్ రాజేంద్రా! బుకాయించి ప్రయోజనం లేదు. నేను నీ జవాబు కోసం. సంజాయిషీ కోసం ఇక్కడికి రాలేదు. సరాసరి నిన్ను తీసుకెళ్ళడానికే వచ్చాను. నా సంగతి నీకు తెలీదు. అనవసరంగా అబద్ధాలు చెప్పడానికి ప్రయత్నించకు." మాటలు ఎంత కోపంగా అన్నాడో. అంత పట్టుదలగానూ ఉన్నాయి. మధు బలిష్ఠమైన శరీరంలో కండలు బిగుసుకొంటున్నాయి. గొడవ జరిగేటట్టు ఉంది.

ఉన్న ఊళ్ళో పరపతి పోతుందనే భయం రాజేంద్రను తగ్గేట్టుగా చేశాయి. "మధుగారూ! జరిగింది నిజమే... ఒప్పుకుంటున్నాను. స్వప్న మీద తాత్కాలికమైన కోరికే తప్ప భార్యను చేసుక వాలనే అభిప్రాయం నాకు లేదు. పైగా నాకు పెళ్ళి నిశ్చయమై పోయింది. మీరు మా ఇద్దరికీ బలవంతంగా పెళ్ళి చెయ్యగలరు. కానీ. తరవాత నేను మాత్రం ఆవిడతో మనఃస్ఫూర్తిగా కాపురం చెయ్యలేను. మీరు బాగా ఆలోచించుకోండి. తాళి పేరుతో ఆమె మెడకు ఉరి బిగించమంటారా-చెప్పండి! మొదటి నుంచీ స్వప్నను మీరు చేసుక వా లనుకున్నారని విన్నాను. మీరే..." మధ్యలో నాన్నాడు రాజేంద్ర.

"ఇదో రకం పలాయనవాదం అన్న మాట. రాజేంద్రా! నువ్వు తప్పించుకోడానికి ప్రయత్నిస్తు న్నావు!" కరుకుగానే అన్నాడు మధు.

"ఇది పలాయనవాదం కాదు. ఒకవేళ స్వప్నతో నా పెళ్ళి జరిగితే నా జీవితమూ. ఆమె జీవిత మూ కూడా నరకం అవుతాయి. మనసులేని మనువు మాపాలిట శాపంలా తయారవుతుంది. అటు ఆమె. ఇటు నేను మనశ్శాంతిని కోల్పోవడం మీ కిష్టమైతే..." తల వంచుకొని నిలబడ్డాడు రాజేంద్ర.

రాజేంద్ర మాటలు మధు గుండెలో మారుమ్రోగు తున్నాయి. 'రాజేంద్ర ఒకవేళ అలా చేస్తే స్వప్న జీవితం సర్వనాశన మవుతుంది' అని అనుకొని. "రాజేంద్రా! నిన్ను ప్రస్తుతానికి వదలి పెడుతున్నా ను. నేనూ ఆలోచించుకోవాలి. ఈలోగా తప్పించుకో డానికి ప్రయత్నించావో ఎప్పటికైనా ఈ మధు నీ గుండెలో నిద్రపోతాడు. ఈ మాట మాత్రం మరచి పోకు." విసురుగా అని వెనక్కి తిరిగి చూసుకుపో యాడు మధు.

** ** **

బస్సులో ప్రయాణం చేస్తున్న మధు ఓ దృఢ నిశ్చయాని కొచ్చాడు. 'స్వప్న తన మాట వింటుంది. ఆమె జీవితంలో వెన్నెల కురిపించా లి' అనుకొన్నాడు.

బస్సు దిగి రిక్షా ఎక్కాడు. రిక్షా వాణ్ణి తొందరగా తొక్కమని పురమాయించాడు. 'నో! స్వప్న చేయని నేరానికి ఆమె జీవితం మోడైపోకూడదు. స్వప్నను తనదాన్ని చేసుకోవాలి.' పెళ్ళికూతురులా ముస్తా బైన రూపంలో స్వప్న మధు మనసులో మెది లింది.

రిక్షా ఇంటి ముందాగింది. రిక్షా వాడికి డబ్బు లిచ్చేసి పరుగు లాంటి నడకతో ఇంట్లోకి వెళ్ళా డు మధు. ఇల్లంతా గోలగోలగా ఉంది. రామనా థంగారు ఓగాలుగా గోడ కానుకొని నిలుచుని ఉన్నారు. కళ్ళలోంచి కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి. అన్నపూర్ణమ్మ మధును చూసి గుండె బాదుకుంటూ ఏడ్చింది. మధవి కళ్ళు తుడుచుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఎదురు గా చాప మీద స్వప్న నిర్జీవంగా పడి ఉంది. మధుకు విషయం అర్థమైంది. "స్వప్నా!" ఇల్లు దద్దరిల్లేలా అరిచాడు మధు. అది అరుపు కాదు. గుండె పగిలి బయటకు వచ్చిన కేక! అక్కడున్న వాళ్ళంతా ఓ క్షణం పాటు తల తిప్పి మధువైపు చూశారు.

మధు తడబడుతున్న అడుగులతో స్వప్న దగ్గరకు వచ్చాడు. "స్వప్నా! స్వప్నా! ఎంత పని చేశావంటూ" గొణిగాడు.

ఆమె ప్రక్కనే మోకాళ్ళ మీద కూర్చుని మౌనంగా ఏడవసాగాడు. విషయం విని అంతకు ముందే అక్కడి కొచ్చిన మధు స్నేహితుడు మురళి మధుని ఓదార్చి. స్వప్న తలగడ క్రింద దొరికిన ఉత్తరం చేతి కిచ్చాడు.

మధు దృష్టి ఉత్తరంవైపు మళ్ళింది. ఉత్తరం మడత విప్పాడు ఆత్రతగా. కళ్ళలో నీటిపొర ఉండడం వల్ల అక్షరాలు మసక మసగ్గా కనిపించాయి. మధులో ఆత్రత ఎక్కువైంది. చేత్తో కళ్ళు తుడుచుకొని ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

"బావా!

నే నంటే నీ కెంత అభిమానమో నాకు తెలుసు. రాజేంద్రను ఒప్పించి తీసుకు వస్తానని వెళ్ళావు. కానీ. బావా! వా డొక నటుడు. నన్ను చేసినట్లే నిన్నూ మోసం చేస్తాడు. అక్కడ ఘర్షణ జరుగు తుందనీ. నా మీది అభిమానంతో ఒక నిశ్చయానికి వస్తావనీ నాకు తెలుసు. కానీ. బావా! వాడిపోయిన ఈ పుష్పం దేవుడి పూజకు పనికి రాదు. మలినమై న ఈ స్వప్న నీకు ఇల్లాలు కారాదు. అందుకే బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నన్ను మన్నించు. బావా! కరిగిపోయిన ఈ స్వప్నను మనసారా మన్నించు. బావా! మరో జన్మంటూ ఉంటే తప్పక నీ జీవిత భాగస్వామిని కావాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ. అందని ఏ దూరతీరాలకో నీ అనుమతి లేకుండా వెళ్ళిపోతున్న ఈ స్వప్నను క్షమిస్తావు కదూ!

ఇట్లు నీది కాలేకపోయిన...

—స్వప్న"

ఉత్తరం చదివిన మధు హృదయం ఆవేదనతో ఘోషిస్తోంది. బయట వర్షం ఆరంభమైంది. ఆకా శం ఉరుములు. మెరుపులతో ఆక్రోశిస్తోంది. 'స్వ ప్న వెళ్ళిపోయింది... నా స్వప్నం కరిగిపో యింది...' పిచ్చిగా గొణుక్కున్నాడు మధు.

చాపమీద ప్రశాంతంగా నిదురపోతున్నట్లుంది స్వప్న.

*

